క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, కాజీపేట సోమిడి ఫీడర్‌లోని విష్ణుపురి కాలనీ, కాజీపేట మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మినీ డెయిరీ ప్రాజెక్టును అమలు చేయాలి

హన్మకొండ: సంగెం, గీసుకొండ, ఆత్మకూరు మండలాల్లో మినీ డెయిరీ ప్రాజెక్టును అమలు చేయాలని గాంధీయన్ మహాజన కాంగ్రెస్ ఇండస్ట్రీయల్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మందపెల్లి సురేష్ కోరారు. ఈమేరకు హనుమకొండ భవానీనగర్‌లోని స్వగృహంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని మందపెల్లి సురేష్, సొసైటీ సభ్యులు ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఎస్సీ కార్పొరేషన్.. 2018 –2019లో మినీ డెయిరీని పైలట్ ప్రాజెక్టుగా ఒక పాలసీని ప్రకటించిందని వివరించారు. మొదటి విడతలో 10 మండలాల్లో అమలు చేస్తామని చెప్పి ఆరు మండలాలను మాత్రమే ఎంపిక చేసిందని, మిగిలిన సంగెం, గీసుకొండ, ఆత్మకూరు మండలాలతో పాటు కామారం గ్రామాన్ని రెండో విడతలో ఎంపిక చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలి

న్యూశాయంపేట: సంక్షేమ హాస్టళ్లల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. హనుమకొండ బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సమయపాలన పాటించకుండా, మెనూప్రకారం భోజనం పెట్టకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న హాస్టల్ వెల్ఫేర్ అధికారులపై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని సమావేశంలో వామపక్షాల విద్యార్థి సంఘాల నేతలు బి.సంతోష్, శ్రీకాంత్, నరసింహారావు, రాజేష్‌నాయక్, రంజిత్, చరణ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓఎస్ కాలనీ కార్యవర్గం



మడికొండ: మడికొండలోని టీఎన్‌జీఓఎస్ కాలనీ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెట్టెం సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా నల్ల సతీష్‌కుమార్, కోశాధికారిగా బిల్ల లక్ష్మినర్సయ్య, ఉపాధ్యక్షులుగా పల్లపు శ్రీనివాస్, బి.రాఘవరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా చందు, శంకరయ్యను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎస్.రాజ్‌కుమార్, పి.శ్రీనివాసులు వ్యవహరించారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠకు కాలనీవాసుల ఆమోదం

ఖిలా వరంగల్: శంభునిపేట దూపకుంట రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో కాలనీ ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. గ్రామ దేవత బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనను వైభవంగా జరుపుకునేందుకు అన్నికాలనీల ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అందరి నిర్ణయం ప్రకారం వేదపండితుడు పోలోజు భాస్కరాచారి శాస్త్రబద్ధంగా బొడ్రాయి ఏర్పాటుకు స్థల పరిశీలన చేయనున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. సమావేశంలో శంభునిపేట, జంగాలకాలనీ, గణేష్‌నగర్, గిరిప్రసాద్‌నగర్, ఎంఎంనగర్, జానునగర్ కాలనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని రెడ్డి కాలనీకి చెందిన చందు అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ మంజూరు కాపీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ మేరకు ఆదివారం బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో బాధితుడి తండ్రి సాంబమూర్తికి రూ.75వేల ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు.

ఎంపీగా అవకాశం ఇవ్వండి

ఐనవోలు: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని న్యాయవాది డాక్టర్ గోపిక రాణి కోరారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం దరఖాస్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇప్పటికే 9 స్థానాలకు బీజేపీ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన ఎనిమిది స్థానాల్లో వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి తనకు అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తాను ఆర్ఎస్ఎస్ భావజాలంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన ఎస్సీ మహిళగా, సీనియర్ న్యాయవాదిగా తనకు మంచి గుర్తింపు ఉన్నట్లు బీజేపీ పెద్దలకు వివరించారు.

బాపూజీనగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఆశ కార్యకర్తలు



మడికొండలో పోలియో చుక్కలు వేస్తున్న ఆశ కార్యకర్త



హనుమకొండలోని పెద్దమ్మగడ్డలో..



పోలియో రహిత సమాజానికి కృషి

పోలియో రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు కోరారు. నగరవ్యాప్తంగా పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ప్రశాంత్‌నగర్ చుక్కల మందు వేస్తున్న కార్పొరేటర్ ఎలకంటి రాములు



ఏసిరెడ్డినగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్



31వ డివిజన్‌లో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ మామిండ్ల రాజు



భీమారంలో రైతుబంధు సమితి జిల్లా కమిటీ మాజీ సభ్యుడు విక్టర్‌బాబు



ఖిలా వరంగల్‌లో కాంగ్రెస్ నేత శ్రీరాం రాజేష్

కార్మికుల పిల్లలకు పోలియో చుక్కలు వేయండి

ఖిలా వరంగల్: పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆదివారం చేపట్టినప్పటికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికుల పిల్లలకు ఎస్ఎంలు, ఆశవర్కర్లు చుక్కల మందు వేయలేదని స్థానికులు వాపోయారు. మండల పరిధిలో నక్కలపెల్లి, తిమ్మాపురం, అల్లీపురం, గాడిపెల్లి గ్రామాలకు ఉదయాన్నే 7గంటలకు రావాల్సిన వ్యాక్సిన్ బాక్సులు మధ్యాహ్నం 12గంటలకు వచ్చాయి. ఆలస్యంగా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారని స్థానికులు చెబుతున్నారు. ఎండ తీవ్రంగా కారణంగా వ్యాక్సిన్ వేయకపోవడంతో పోలియో చుక్కల కోసం వచ్చిన పిల్లల తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. అలాగే, నక్కలపెల్లి, గాడిపెల్లి దూపకుంట ఏరియాల్లో ఇటుక బట్టీల్లో పనిచేసే వందలాది మంది కార్మికుల పిల్లలకు చుక్కల మందు వేయలేదని కార్మికుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పిల్లలందరికీ పోలియో వ్యాక్సిన్ వేయాలని కోరుతున్నారు.

బీఏఎంఎస్ టాపర్ తేజశ్రీకి ఘన సన్మానం

ఖిలా వరంగల్: అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల –2017 బ్యాచ్‌లో బీఏఎంఎస్‌లో టాపర్‌గా నిలిచిన డాక్టర్ బుదారపు తేజశ్రీని శివనగర్‌లోని మహాలక్ష్మి విహార పరపతి సంఘం ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శామంతుల భిక్షపతి, బుదారపు భాస్కర్, ఆడెపు సాంబమూర్తి, మాచర్ల కిషన్, కుడికాల మనోహర్, కందగట్ల గణేష్‌బాబు, మాచర్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ వెంటనే ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం

హన్మకొండ అర్బన్: నాలుగు పెండింగ్ డీఏలను ఎన్నికల కోడ్ రాకముందే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.పురుషోత్తం డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ పక్షాన పీఆర్సీ కమిషనర్ శివశంకర్ సమర్పించిన ప్రతిపాదనలను సభ్యులకు పురుషోత్తం వివరించారు. నూతన పీఆర్సీలో 40శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, 5శాతం నుంచి 20శాతం వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, కమ్యూటేషన్ తిరిగి చెల్లింపు పరిధిని 15నుంచి 12 ఏళ్లకు తగ్గించాలని, పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. కాగా, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా 5ఏళ్ల తరువాత ఒకటవ తేదీన ఉద్యోగులు, పెన్షనర్లకు వేతనాలు అందించడంపై సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు జి.వీరస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కె.సమ్మారెడ్డి, కె.రమేష్, సింగారెడ్డి, సూర్యప్రకాశ్, రాజిరెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లింగమూర్తి సేవలు చిరస్మరణీయం



సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

వరంగల్ చౌరస్తా: కార్మిక నాయకుడు, తెలంగాణ ఉద్యమనేత కూరపాటి లింగమూర్తి సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కొనియాడారు. వరంగల్ చౌరబౌళిలోని పద్మశాలి భవనంలో ప్రింటింగ్, బైండింగ్ ప్రెస్ వర్కర్స్ యూనియన్, లింగన్న మిత్ర బృందం ఆధ్వర్యంలో లింగమూర్తి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా లింగమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బండా ప్రకాశ్ మాట్లాడుతూ లింగమూర్తికి విద్యార్థి దశ నుంచే విప్లవ భావాలు ఉన్నాయని, సమాజానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో చంద్రమౌళి, గంగుల దయాకర్, తొటం భాస్కర్, సదానందం, గుండేటి నరేందర్, ఓని స్వర్ణలత, భాస్కర్, కొణతం కృష్ణ, మాటేటి అశోక్‌కుమార్, సురేష్‌బాబు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శివానంద ట్రస్టు సేవలు ప్రశంసనీయం



గురుధామంలోని మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, ట్రస్టీలు

వరంగల్: ప్రజాసేవలో శివానంద గురు కల్చరల్ ట్రస్టు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.చంద్రశేఖర్ ప్రశంసించారు. ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో శివానంద ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ మాట్లాడుతూ సనాతన సంప్రదాయ ఆచరణ పద్ధతులు, విద్య, వైద్యం, ఆహారం, ఆరోగ్యం, భద్రత, మహిళల రక్షణ విషయాలపై సదస్సులు, సింపోజీఎంలు నిర్వహిస్తామని చెప్పారు. మరో ట్రస్టీ బండారు సాయినారాయణ మాట్లాడుతూ వచ్చిన భక్తులు, ప్రజలకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు.

8న ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం



సమ్మేళనం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాకేష్‌రెడ్డి, తదితరులు

వరంగల్ చౌరస్తా: ఈనెల 8న మహాశివరాత్రి పర్వదినాన హనుమకొండ హయగ్రీవాచారి మైదానంలో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని గ్రాండ్ గాయత్రి హోటల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా పలువురు వక్తలు పాల్గొంటారని చెప్పారు. గంగాధర శాస్త్రి, రాధా మనోహర్‌దాస్ ప్రవచనం ఉంటుందని అన్నారు. సప్తహారతి, పేరిని శివతాండవం, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు, గాయకులు వందేమాతరం శ్రీనివాస్, చరణ్, అర్జున్, సినీ, జానపద కళాకారుల రానున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బొమ్మ నాగరాజు, కార్పొరేటర్ రవినాయక్, కత్తుల అభిషేక్, దీపక్, సుకాంత్, వేలేరు ఎంపీటీసీ భూపతి రాజు, అమరేష్, రాజేష్, క్రాంతి, మండల సురేష్, యశ్వంత్, లక్ష్మణ్, సతీష్, గణేష్, నాగరాజు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ అందిస్తున్న సుందర్‌రాజ్, మసూద్

న్యూశాయంపేట: మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందిన 5వ బ్యాచ్‌కు చెందిన నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ములుగురోడ్డు ఎంసీసీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కుట్టుమిషన్, సర్టిఫికెట్లను కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాయిద్ మసూద్, ఎంఐఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ అనీస్‌సిద్దిఖీ, మిర్జామసూద్, వాహిద్‌నాసినీస్, సయ్యద్ అక్బర్, నదీమ్‌బేగ్ తో పాటు మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

హసన్‌పర్తి: ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీసీఎస్ సీఐ శంకర్ నాయక్ సూచించారు. గోపాలపురం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీషర్ట్‌లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ గంటపాటు వ్యాయామం చేయాలని, ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ ప్రశాంత జీవితం సాగించాలని చెప్పారు. ప్రతీ వాకర్ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపాలపురం వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యాదిరెడ్డి, అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు వనపర్తి కుమార్‌స్వామి, అమ్రుసింగ్, శ్రీనివాస్, సభ్యులు బాపురెడ్డి, కట్ల సతీష్‌రెడ్డి, రాజేందర్, సునీల్, రమణయ్య, బుచ్చిరెడ్డి, సీతారం, తిరుపతి, రమేష్, రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటలు, నడకతో ఆరోగ్యం



వాకర్స్‌తో మాట్లాడుతున్న పరంజ్యోతి

దేశాయిపేట: రోజూ ఆటలు ఆడడం, నడక ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు జన్ను పరంజ్యోతి అన్నారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్, కేయూ యూనివర్సిటీ మైదానంలో వాకర్స్‌ను ఆదివారం కలిసి ముచ్చటించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ జన్ను ప్రసన్న, జన్ను అరుణాకర్, సారం అభిలాష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

న్యూశాయంపేట: ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గా వద్ద ఉన్న కార్యాలయంలో కార్డియాలజీ, గైనికాలజీ వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు సలహాలు, సూచనలు అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో నిపుణులు డాక్టర్ షఫీ, డాక్టర్ అనీసా బేగం, డాక్టర్ అనీసా, సొసైటీ బాధ్యులు అబ్దుల్ కలీం, సిరాజ్ అహ్మద్, వాహిద్‌నాసిన్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పరకాల: కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్న లక్ష్యంతో ప్రతీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాల కాంగ్రెస్ పార్టీ కోర్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ తీసుకురావడానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పరకాల ఎంపీపీ టి.స్వర్ణలత, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామర మండలాల అధ్యక్షులు కట్కూరి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్.. తాగునీరు వృథా



కాజీపేట: కాజీపేట చౌరస్తా ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరంతా వృథాగా రోడ్డుపాలవుతోంది. పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేయడంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకేజీల కారణంగా ఉపయోగపడాల్సిన తాగునీరు నేలపావుతోందని వాపోతున్నారు. నల్లాల ద్వారా ఎగువ ప్రాంతాలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలు కాలనీలవాసులు చెబుతున్నారు. పగిలిన పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని అధికారులను కోరుతున్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతా



అశోక కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని అశోకకాలనీలో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం, రోడ్డు వెడల్పు పనులు, విద్యానగర్‌లో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, సమ్మయ్యనగర్‌లో రూ.7 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. నక్కలగుట్టలోని భేతి కేశవరెడ్డి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్ నల్ల సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

గాంధీనగర్ సమస్యల పరిష్కారానికి కృషి

గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని గాంధీనగర్‌లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య వినతిపత్రం అందించారు. ఈమేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ఎం.వీరేందర్, డి.కమలాకర్ రావు, జాయింట్ సెక్రటరీ ఎం.శ్యాంప్రసాద్, డైరెక్టర్లు ఎ.సురేందర్, కనకయ్య, సుభాష్, ఎం.మల్లారెడ్డి తదిరులు పాల్గొన్నారు.

ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: సిద్ధాంతం, క్రమశిక్షణ గల పార్టీ అని, హిందువుల పరిరక్షణే తమ ధ్యేయమని చెప్పుకునే బీజేపీ.. ఫిరాయింపులను ప్రోత్సహించడమే ధ్యేయంగా పెట్టుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో శ్రీనివాస్‌రావుతో పాటు, బీకేఎంయూ జాతీయ కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్, పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీకేఎంయూ పతాకాన్ని సీనియర్ నాయకుడు మోతే లింగారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ అప్రజాస్వామికంగా ఇతర పార్టీ నాయకులను తమ పార్టీలో చేర్చుకుంటున్న బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. వామపక్ష, ప్రజాస్వామ్య వాదులంతా ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, ఎల్లేష్, వెంకటేశ్వర్లు, సృజన్, వెంకన్న, తిరుపతి, లక్ష్మణ్, ఎం.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఓటు బ్యాంకుగా మారొద్దు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చైతన్య మహిళా సంఘం, ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ: మహిళలు ఓటు బ్యాంకుగా మారొద్దని, తమ హక్కుల సాధనకు పోరాడుదామనే నినాదంతో ఈ సంవత్సరం చైతన్య మహిళా సంఘం ముందుకు సాగుతోందని సంఘం జిల్లా కన్వీనర్ జె.కళ అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మా భూమి సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కళ మాట్లాడుతూ ఇటీవల తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయని, జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళల ఓట్లతో అధికారంలోకి రావడానికి అన్ని రాజకీయ పార్టీలు ఉచిత పథకాలను అమలు చేస్తామని వాగ్దానం చేసి ఎన్నికల్లో గెలుపొందాయని వివరించారు. పేదరికం, పితృస్వామ్య ఆధిపత్యంతో మహిళలు ఆర్థిక స్వేచ్ఛలో చాలా వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో దళిత, బహుజనులు మరింత అట్టడుగున ఉన్నారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా మహిళల పరిస్థితి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉందని వాపోయారు. మహిళలు సమస్యల సాధనకు పోరాడాలని చైతన్య మహిళా సంఘం కోరుతోందన్నారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం జిల్లా కో కన్వీనర్ అనిత, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకుడు జనగాం కుమారస్వామి, మానవ హక్కుల సంఘం నాయకుడు బాదావత్ రాజు, సీఎల్‌సీ నాయకులు జయంత్, చైతన్య మహిళా సంఘం సభ్యులు సత్య, విలాసిని, రమ, తదితరులు పాల్గొన్నారు.